క్లుప్తంగా

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

బాడంగి: మండలంలోని కోమటపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నేత్ర వైద్యశిబిరం మంగళవారం నిర్వహిస్తున్నట్లు విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి క్యాంప్ జూనియర్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో దత్తిరాజేరు మండలంలోని పోరలికి చెందిన సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సహకారంతో ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

బొబ్బిలి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండలంలోని కారాడ గ్రామంలో సోమవారం పర్యటించిన ఆయన అక్కడి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు తవ్వుకోవాలి

రేగిడి: భూగర్భజలాల సంరక్షణకు ప్రతీ ఇంటి ముందు ఇంకుడుగుంతలు తవ్వుకోవాలని స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ సూచించారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి, ఇంకుడుగుంతల ప్రయోజనాన్ని వివరించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పొలం పిలుస్తోంది'

తెర్లాం: మండలంలోని ఆమిటి, కొరటాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఏవో జి.సునీల్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారంలో ప్రతీ మంగళ, బుధవారాల్లో రెండేసి గ్రామాల చొప్పున ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పెరుమాళి, పెదపొలవలస గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉంటుందని, రైతులకు పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

గ్రామసభలు నిర్వహించండి



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు విధిగా నిర్వహించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన.. గ్రామసభల నిర్వహణ, వాటిల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం వంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీల వారీగా అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.

మద్యం సీసాలు పట్టివేత



పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న ఎస్‌ఐ తారకేశ్వరరావు

బాడంగి: మండలంలోని మల్లంపేట చెరువు వద్ద అక్రమంగా తరలిస్తున్న 43 మద్యం సీసాలను పోలీసులు సోమవారం పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. మద్యం అక్రమ రవాణాపై ముందస్తు సమాచారం మేరకు చెరువు దగ్గర కాపుకాసిన పోలీసులు అటువైపుగా మద్యం సీసాలతో వస్తున్న బొత్సవానివలసకు చెందిన అమర సత్యనారాయణను పట్టుకున్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. నిందితుడిని ప్రస్తుతం బొబ్బిలి కోర్టుకు తరలించామని ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



విరాళం అందజేస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ సభ్యులు

బొబ్బిలి రూరల్: విజయవాడ వరద బాధితులకు బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ (ఎల్డర్స్) సభ్యులు ఆర్థికసాయం చేశారు. రూ.20 వేల నగదును ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడులను మండలంలోని కారాడ గ్రామంలో సోమవారం కలిసి, అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ కొల్ల అదృష్టకుమార్, అధ్యక్షుడు రావు సీతారామస్వామి పాల్గొన్నారు.

సేవే లక్ష్యం



దోలపేట శివాలయం వద్ద శ్రమదానం చేస్తున్న జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు(ఫైల్)

- ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవాభావం
- శ్రమదానం మొదలుకుని సమాజసేవ దిశగా పయనం
- నేడు ఎన్ఎస్ఎస్ డే

రాజాం సిటీ: విద్యార్థులను సమాజసేవ వైపు నడిపించడంతో పాటు అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలను సామాజికంగా, ఆరోగ్య పురోభివృద్ధి వైపుగా అడుగులు వేయించేందుకు ఎన్ఎస్ఎస్(నేషనల్ సర్వీస్ స్కీమ్/జాతీయ సేవా పథకం) ఏర్పడింది. దీనిపై క్రమేపీ విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. సేవే లక్ష్యంగా వారు ముందుకు సాగుతున్నారు. గ్రామాల్లో తమవంతు సాయంగా శ్రమదానం చేయడంతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆసరాగా నిలుస్తున్నారు. ఐదు దశాబ్దాలుగా వీరి సేవలు విస్తృతమవుతున్నాయి. సామాజిక సేవల ఆధారంగా ఎన్‌సీసీ నుంచే కాకుండా ఎన్ఎస్ఎస్ నుంచి కూడా దేశ రాజధాని ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ పరేడ్‌కు విద్యార్థులు ఎంపికైన సందర్భాలూ ఉన్నాయి. తద్వారా రిజర్వేషన్లు కూడా పెంచుకుంటూ విద్యార్థులు ముందుకు సాగిపోతున్నారు.

ఆవిర్భావం నుంచి..

కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు ఎన్‌సీసీకి ప్రత్యామ్నాయంగా 1969 సెప్టెంబరు 24వ తేదీన అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి వీకేఆర్‌వీ రావు తరగతి గది నుంచి సమాజంలోకి అనే నినాదంతో ఎన్ఎస్ఎస్‌ను ప్రారంభించారు. కళాశాలల విద్యార్థులను సేవాభావం వైపు నడిపించారు. అప్పటి నుంచి సమాజసేవలో అన్ని ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, సేవలందిస్తున్నారు. జిల్లాలో ఎన్ఎస్ఎస్ సేవలను క్రమక్రమంగా విస్తరిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లు అనేక కార్యక్రమాలు చేపట్టి, ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.

కార్యక్రమాలివే..

- పరిసర గ్రామాలను దత్తత తీసుకుని, ఆ గ్రామాల్లో రోడ్లు వేయించడం, మురికివాడలను శుభ్రం చేయించడం, నిరక్షరాస్యులకు విద్య ఆవశ్యకతను తెలియజేయడం
- ఆరోగ్య సూత్రాలు, వయోజన విద్య ఆవశ్యకత, జనాభా సమస్య నివారణ గూర్చిన విషయాలు చెప్పడం
- ప్రకృతి విపత్తుల సమయాల్లో సహాయం చేయడంలో ముందుండడం
- పొదుపు ఆవశ్యకత, అంటువ్యాధుల వల్ల కలిగే నష్టాలు, అరికట్టే విధానాలను ప్రజలకు వివరించడం

మారుతున్న దిశ..

గతంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండడంతో పాటు చైతన్యం అంతగా లేని కారణంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆయా కళాశాలల పరిధిలోని గ్రామాలకు వెళ్లి, శ్రమదానం, పలు సేవా కార్యక్రమాలతో వాటి అభివృద్ధికి తోడ్పడేవారు. మంచినీటి చెరువులను శుభ్రం చేయడం, నేలబావుల్లో క్లోరినేషన్ చేయించడం, రోడ్లు బాగు చేయించడం వంటి పనుల్లో భాగస్వాములయ్యేవారు. విద్య ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీలు చేపట్టి, ప్రజల్లో అవగాహన పెంచేవారు. ఇప్పుడు కాలం మారింది. మానవ వనరులు పెరగడంతో పాటు అభివృద్ధి పనులకు గ్రామీణులు ముందుకు రావడంతో ఎన్ఎస్ఎస్ తన దిశను మార్చుకుంటోంది. అవగాహన కార్యక్రమాల ద్వారా గ్రామీణుల్లో చైతన్యం తీసుకువచ్చి, వారి పనులు వారే చేసుకునేలా కృషిచేస్తోంది. వ్యాధుల నివారణ చర్యలపై అవగాహనతో పాటు అభివృద్ధిపై చైతన్యవంతులను చేస్తున్నారు. ఉచిత వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు, ప్లాంటేషన్, కాలుష్య నివారణలపై నిత్యం అవగాహన కల్పిస్తూ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోండి



ఫిజియోథెరపీ సేవలందిస్తున్న వైద్యుడు భరద్వాజ్

రేగిడి: ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపీ వైద్య నిపుణుడు ఎం.భరద్వాజ్ కోరారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో దివ్యాంగులైన పలువురు చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు సోమవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడ చేస్తున్న ఫిజియోథెరపీని ఇంటి వద్ద కూడా క్రమం తప్పకుండా పిల్లలతో చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ప్రతినెలా ఇక్కడ ఫిజియోథెరపీ సేవలు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రసాదరావు, ఎరకయ్య, ఐఈఆర్‌పీ యు.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం



యోగాసన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎంపీటీసీ సభ్యుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, ఎంఈవోలు దొర, రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణలు కలిసి ఈ పోటీలను ప్రారంభించి, విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. మండలంలోని 12 పాఠశాలల నుంచి మొత్తం 180 మంది క్రీడాకారులు క్రీడల్లో పాల్గొన్నారని పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటనాయుడు తెలిపారు. కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, చెస్ పోటీలు జరిగాయని, విజేతలైన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీలు రాజశేఖర్, స్వప్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



స్వర్ణాంధ్ర-2047 వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ, తదితరులు

తెర్లాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో స్వర్ణాంధ్ర–2047 కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎంపీడీవో శంబంగి రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు స్వర్ణాంధ్ర లక్ష్యాలు, సాధన, ప్రణాళికల తయారీ, గ్రామ సభల్లో తీర్మానాలు వంటి వాటిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్రంలో పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఉద్యోగిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నీలిమ, ఎంఈవో త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిబాబు

రాజాం: ప్రతిఒక్కరూ మెరుగైన జీవనానికి ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆ ఆస్పత్రి మైదానంలో సఫాయి సేవా సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. శానిటేషన్ సిబ్బందితో పాటు పలువురు పట్టణవాసులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించి ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

బొబ్బిలి: పట్టణంలోని సీహెచ్‌సీలో పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య తనిఖీల నిమిత్తం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, చికిత్స అందజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, వైద్యాధికారి జి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా రేవతి

బొబ్బిలి: టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఎస్.రేవతి నియమితులయ్యారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జే విద్యుల్లత సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే విజయనగరం టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.ఫిలిప్‌ను బొబ్బిలి టీపీఎస్‌గా బదిలీ చేశారు. ఇక్కడ టీపీవోగా విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్‌ను జీవీఎంసీకి బదిలీ చేశారు. బుడాలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ సత్యనారాయణను సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

భారీ వర్షం



కురుస్తున్న వర్షం

సంతకవిటి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కొన్నిగంటల పాటు వర్షం కురవడంతో దాదాపు 3 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు తహసీల్దారు కల్యాణచక్రవర్తి తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది

రాజాం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది కోరుతున్నారు. ఇదే విషయమై ఆస్పత్రి వద్ద సోమవారం నిరసన చేపట్టారు. గత 20 ఏళ్లుగా తాము పనిచేస్తున్నామని, ఏనాడూ పనికి తగ్గ వేతనం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 549 ప్రకారం తమ జీతాలు పెంచాల్సి ఉందని, ఇంతవరకూ పెంచలేదన్నారు. ప్రస్తుతం వేతనాలు కూడా సకాలంలో అందడం లేదని, ధర్నాలు, నిరసనలు చేస్తే మూడు నెలలకు ఒక దఫా ఒక నెల జీతం ఇస్తున్నారని వాపోయారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో ఈ ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకురాలేకపోతున్నామన్నారు. తమ జీతాల చెల్లింపులో ఉన్న దళారీ వ్యవస్థను తప్పించాలని పట్టుబట్టారు. తమకు ఇంతవరకు పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి బెనిఫిట్స్ కూడా కల్పించలేదన్నారు. ఇప్పటికైనా తమను కార్పొరేషన్ పరిధిలోకి తీసుకుని జీతాలు చెల్లించాలన్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 31వ తేదీ నుంచి సమ్మె చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ఎరకయ్య

రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో బి.ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సంకిలి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. అక్కడి రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాల బోధన చేపట్టాలని, లెస్సన్‌ప్లాన్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి, బోధిస్తే బోధన మరింత సమర్థవంతంగా ఉంటుందన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటకాలు పెట్టేలా పర్యవేక్షించాలన్నారు.

దసరా ఉత్సవాలకు ముహూర్తపు రాట



ఆలయ ఆవరణలో ముహూర్తపు రాట వేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయంలో నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు సంబంధించి, ముహూర్తపు రాటను సోమవారం వేశారు. అక్టోబరు 3వ తేదీ నుంచి జరగనున్న శరన్నవరాత్రులకు సంబంధించి, ఏర్పాట్లు చేయనున్నామని ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు తెలిపారు. విజయదశమి వరకు తొమ్మిది రోజుల పాటు చండీహోమం నిర్వహించనున్నామని అర్చకులు రామాయణం శ్రీనివాసశర్మ అన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దాసరి అప్పారావు, కూరాడ వెంకటరావు, చెలికాని లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

బొబ్బిలి రూరల్: ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు సోమవారం ఆందోళన చేపట్టారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, వంద రోజుల పాలన పూర్తయినా వారు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ఆఖరి దశకు వస్తున్నా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఇస్తానన్న రూ.20 వేల సాయం అందలేదన్నారు. దీంతో రైతాంగం అప్పులు చేసి మరీ సాగు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డీవో సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి సత్యంనాయుడు, చుక్క కూర్మినాయుడు, పెంకి సత్యంనాయుడు, పి.శంకరరావు పాల్గొన్నారు.

తూటికాడ కషాయంతో పంటలకు మేలు



తూటికాడ కషాయం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: తూటికాడ కషాయంతో పంటలకు మేలు అని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ గౌరీశ్వరరావు అన్నారు. మండలంలోని చిన్నయ్యపేట గ్రామంలో తూటికాడ కషాయం తయారీ దాని ప్రయోజనాలపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తూటి ఆకులతో తయారు చేసే తూటికాడ కషాయం పంటలపై పిచికారీ చేస్తే పంటకు సోకే తెగుళ్లను నివారించవచ్చన్నారు. తక్కువ పెట్టుబడితో తయారయ్యే ఈ కషాయం ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడుల సాధనకు దోహదం చేస్తుందన్నారు. అనంతరం కషాయం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు పాటించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చాటాయివలస గ్రామంలోని రైతులకు పురుగుమందు పిచికారీపై సోమవారం అవగాహన కల్పించారు. ముఖానికి మాస్క్ ధరించి, ఆ మందు శరీర భాగాల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. అలాగే ఏ పంటకు ఏ పురుగుమందు ఎంతమేర అవసరమో అంతే వేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా తయారు చేసిన ఎరువులను వినియోగిస్తే పంటకు మేలు అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీ తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కఠిన చర్యలు

బొబ్బిలి: ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఎం.శ్రీను హెచ్చరించారు. స్థానిక పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం పర్యటించిన ఆయన అక్కడి ఆక్రమణలు చూసి, మాట్లాడారు. ఖాళీ స్థలాలు ఆక్రమించి, ఇళ్ల పునాదులు నిర్మించిన వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ చర్యలకు వెనుకాడేది లేదన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ కల్యాణచక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఒక్క పథకమైనా ఇచ్చారా?

- కూటమి ప్రభుత్వానికి ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు సూటి ప్రశ్న



మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు

మెంటాడ: వంద రోజుల పాలనలో సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన పథకాల్లో ఏ ఒక్క పథకమైనా అమలు చేశారా అని కూటమి ప్రభుత్వాన్ని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, ప్రభుత్వం చేపడుతున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై నిప్పులుచెరిగారు. ఏ మంచి పని చేయకుండానే ఇది మంచి ప్రభుత్వమని కార్యక్రమం ఎలా నిర్వహించగలుగుతున్నారన్నారు. గడిచిన వంద రోజుల పాలనలో దాడులు, హత్యలే తప్ప ప్రజలకు పనికివచ్చిన పని ఒక్కటైనా చేశారా అని నిలదీశారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న కూటమి నేతలను సంక్షేమ పథకాల అమలు ఏదీ అని ప్రజలు అడుగుతున్నారని, వైఎస్సార్ సీపీ ఉన్నప్పుడే బాగుండేదని పథకాలు సక్రమంగా అందేవని చెబుతున్నారన్నారు. ప్రజలకు భయపడి ఇప్పుడు ఆ కార్యక్రమ నిర్వహణను అధికారులకు అప్పగించారని ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా నీచరాజకీయాలు మాని, ప్రజలకు మంచి చేయాలని హితవుపలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

బొబ్బిలి: తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు సాదరస్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం కల్పించారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు కాశినాయుడు, తదితరులు ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



చిన్నపుర్లిలో ప్రచారం చేస్తున్న సభ్యులు

రేగిడి: మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస, దేవుదళ, చిన్నపుర్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం సోమవారం నిర్వహించారు. శ్రీకాకుళానికి చెందిన త్రైత సిద్ధాంత భగవద్గీత ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి సభ్యుడు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులు భగవద్గీత గొప్పతనం వివరించారు. ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలని, అందులోని సారాంశాన్ని గ్రహించి, ఉన్నత జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గారావు, పుండరీకాక్షయ్య, గోపాలకృష్ణ, వెంకటరావు, చిన్నప్పలనాయుడు, పెద్దఅప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి వ్యక్తికి తీవ్రగాయాలు

రామభద్రపురం: గోడ కూలి ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మూలసెలగాం గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. అదే గ్రామానికి చెందిన కారంగి లక్ష్మణరావు ఉదయం 7.30 గంటల సమయంలో టీ తాగుతుండగా ఆయన దగ్గరున్న గోడ కూలిపోవడంతో అతడి తలకు తీవ్రగాయమైంది. అప్రమత్తమైన కుటుంబసభ్యులు వైద్య సేవల నిమిత్తం అతడిని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలకు విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తెర్లాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ తాము తినే రోజువారీ ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి సూచించారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆదేశాల మేరకు పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.